క్లుప్తంగా

బోరు బావులకు నిధులు మంజూరు



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంవైరారోడ్‌: బీఆర్‌ఎస్‌ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం బురహాన్‌పురంలో రెండు బోరు బావుల తవ్వకానికి నిధులు మంజూరు చేశారు. 51వ డివిజన్‌ బురహాన్‌ పురంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో, దానికి సమీపాన ఉన్న మరోచోట రెండు బోర్ల ఏర్పాటుకు శుక్రవారం పనులు ప్రారంభించారు. అనంతరం పలు గణపతి మండపాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శీలంశెట్టి వీరభద్రం, కార్పొరేటర్‌ శీలంశెట్టి రమ, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి బాపట్ల మురళి, నాడెం శాంతి కుమార్, ఆలేటి వెంకటప్పయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కూసుమంచి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని రాజుపేట గ్రామ శివారు డబుల్‌బెడ్రూం కాలనీ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోరీలపాడు తండాకు చెందిన సోమ్లా, నెహ్రూ బైక్‌పై వెళ్తుండగా డీసీఎం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు కావడంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

'డేర్‌' అధ్యక్షుడిని కలిసిన జేయూహెచ్‌ బృందం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న బృందం

ఖమ్మం మయూరిసెంటర్‌(ఖమ్మం మామిళ్లగూడెం): డాక్టర్ల అసోసియేషన్‌ ఫర్‌ ది రిలీఫ్‌ అండ్‌ ఎడ్యుకేషనల్‌ (డేర్‌) అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన ఖమ్మానికి చెందిన ప్రముఖ డాక్టర్‌ అన్వర్‌ను జమాత్‌ ఇస్లామిక్‌ బృందం శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. డేరా ఆధ్వర్యంలో పేదలకు మరిన్ని మెడికల్‌ క్యాంపులు నిర్వహించాలని, మెడిసిన్‌ చదువుతున్న విద్యార్థులకు సరైన సూచనలు సలహాలు అందించాలని జేయూహెచ్‌ బృందం సూచించింది. జిల్లా అధ్యక్షుడు జైనుల్‌ పాషా, ఉపాధ్యక్షుడు అబ్దుల్‌ సమీ, మీడియా సెక్రటరీ అబ్దుల్‌ మలిక్‌ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

కూసుమంచి: మలిదశ తెలంగాణా ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ మలిదశ ఉద్యమకారులు శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్‌ సౌకర్యాన్ని కల్పించాలని కోరగా మంత్రి హామీ నెరవేరేలా చూస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో దాసరి బాలకృష్ణ, షేక్‌ రంజాన్, చిన్నం సంగయ్య, మామిడి ఎల్లయ్య, నర్సింహాచారి, వెంకటరెడ్డి, వెంకన్న, నర్సింహారావు ఉన్నారు.

సమస్యలు తెలిపితే అరెస్టులు



నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

ఖమ్మంమయూరిసెంటర్‌: నగరంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరితే అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్‌ సలాం అన్నారు. శుక్రవారం కేఎంసీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి సమస్యలను విన్నవించేందుకు నాయకులు వెళ్తే కమిషనర్‌ను కల్పించలేదన్నారు. ఇంతలోనే కొందరు వ్యక్తులు పెద్దగా మాట్లాడుతూ కార్యాలయ సిబ్బందిపై వాగ్వాదానికి పాల్పడుతున్నారని కమిషనర్‌ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని నాయకులను అదుపులోకి తీసుకొని కార్యాలయం నుండి బయటకు తరలించారు. యానాలి సాంబశివరెడ్డి, త్రీ టౌన్‌ ఏరియా కార్యదర్శి నూనె శశిధర్, జాల నరసింహారావు, డి శేఖర్‌నాయక్, ఎస్‌కే.మీరా పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కూలీ
వినోద	కొత్తలోక, మహావతార్‌ నర్సింహా
సాయిరాం	బ్రహ్మాండ
ఆదిత్య	సుందరకాండ, త్రిబాణధారి బార్బరిక్‌
శ్రీనివాస	వార్‌ 2

- ఖమ్మంగాంధీచౌక్‌

నల్లాల లెక్క తేల్చేందుకు..

ఏదులాపురం పరిధిలోని కనెక్షన్లపై ఆరా

- పన్ను వసూళ్లకు సిద్ధమవుతున్న అధికారులు
- మున్సిపాలిటీకి ఆదాయం చేకూర్చడమే లక్ష్యం



ఏదులాపురం మున్సిపాలిటీ కార్యాలయం

ఖమ్మంరూరల్‌: కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యాన ఏ మార్గాన్ని వదలకుండా ఒడిసి పట్టుకుని ఖజానాను బలోపేతం చేసేలా అధికారులు ప్రయత్నిస్తున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి జరగాలంటే పన్నులు కూడా వసూలు చేయాలని మున్సిపల్‌ పరిధిలో మిషన్‌ భగీరథ నల్లా కనెక్షన్లపై అధికారులు దృష్టి సారించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 32 వార్డుల్లో ఎన్ని కనెక్షన్లు ఉన్నాయనే లెక్కలు తేల్చే పనిని వార్డు ఆఫీసర్లకు అప్పగించారు. లెక్కల్లో నిమగ్నమైన వార్డు ఆఫీసర్లు ఉండగా మున్సిపల్‌ పరిధిలో నీటి పంపుల సమగ్ర సమాచారానికి 10 మంది వార్డు అధికారులను కేటాయించారు. వీరు రోజుకు కనీసం 30 – 40 వరకు నీటి కనెక్షన్ల వివరాలు సేకరించి ఆ వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు దాదాపు వేయి పంపు కనెక్షన్ల వివరాలను సేకరించారు. ప్రతీ ఇంటికి వెళ్లి నల్లా కనెక్షన్‌ ఉందా, లేదా ఆరా తీయడంతో పాటు ఉంటే యజమాని రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఇంటి పన్ను రశీదు నమోదు చేస్తున్నారు. మిషన్‌ భగీరథ లెక్కల ప్రకారం మొత్తం 20,126 నివాసాలకు గాను 12,221 వరకు నల్లా కనెక్షన్లు ఉండొచ్చని ప్రాథమిక అంచనా. అయితే, సర్వే పూర్తయితే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

పన్ను వసూలైతే ఊరట..

నీటి పంపు కనెక్షన్ల ద్వారా వసూలు చేసే పన్ను మున్సిపాలిటీ ఖజానాకు కొంత ఆదాయం సమకూర్చనుంది. ఇదే కాక అధికారులు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఆదాయాన్ని రాబట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నీటి పన్నుకు రేషన్‌కార్డుకు లింక్‌ ఉండడంతో కార్డు ఉన్న వారికి రోజుకు రూ. 1 చొప్పున నెలకు రూ.30, రేషన్‌కార్డు లేని వారి నుండి నెలకు రూ.120 వరకు వసూలు చేయాలని అంచనాకు వచ్చినట్లు తెలిసింది. అయితే, ఇప్పటికే వివిధ రకాల పన్నులతో సతమతమవుతున్న మున్సిపల్‌ పరిధిలోని ప్రజలకు ఇప్పుడు నల్లా పన్నుతో మరింత భారం పడనుందనే భావన వ్యక్తమవుతోంది.

సర్వే కొనసాగుతోంది..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 32 వార్డుల్లో నల్లా కనెక్షన్ల వివరాలు సేకరిస్తున్నాం. వీటన్నింటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నాం. ప్రస్తుతం సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. మొత్తం పూర్తయితే నల్లా కనెక్షన్లు ఎన్ని, ఎంత మేర ఆదాయం వస్తుందో స్పష్టత రానుంది.

– ఆళ్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌

వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు

- కేఎంసీ కమిషనర్‌ అభిషేక్‌ అగస్త్య



నిలిచిన నీటిని పరిశీలిస్తున్న కమిషనర్‌ అగస్త్య

ఖమ్మంఅర్బన్‌: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నగరంలోని ఖమ్మం–వైరా ప్రధాన రోడ్డు వెలుగుమట్ల పార్క్‌కు వెళ్లే దారిలోని కల్వర్టు వద్ద వర్షపు నీరు నిల్వతో అక్కడ చిన్నపాటి చెరువును తలపిస్తోంది. మూడు రోజులుగా నీరు ఎటూ కదలకుండా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న కేఎంసీకమిషనర్‌ అభిషేక్‌ అగస్త్య శుక్రవారం ఆ ప్రదేశాన్ని సందర్శించారు. టౌన్‌ ప్లానింగ్‌ అధికారులతో కలిసి పరిసరాలను సమగ్రంగా పరిశీలించిన కమిషనర్, వర్షపు నీరు ఎందుకు వెళ్లలేదో కారణాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వర్షపు నీరు సాఫీగా వెళ్లే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

- ఎమ్మెల్యే కోరం కనకయ్య



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే

కామేపల్లి: డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల సముదాయాల వద్ద వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధికారులను ఆదేశించారు. పింజరమడుగులో గత ప్రభుత్వం హయాంలో నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా ఉన్న డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీటి సౌకర్యాలను వెంటనే కల్పించాలని, ఇళ్లకు మళ్లీ రంగులు, దెబ్బతిన్న తలుపులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్‌ డైరెక్టర్‌ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, కొండాయిగూడెం పీఏసీఎస్‌ చైర్మన్‌ ధనియాకుల హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్‌ మేకల మల్లిబాబు, ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, తహసీల్దార్‌ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, నల్లమోతు లక్ష్మయ్య, దమ్మలపాటి సత్యనారాయణ, తోటకూరి శివయ్య, కొమ్మినేని శ్రీనివాసరావు, చల్లా హరి, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

కురుస్తున్న ఆస్పత్రి పాత భవనం



వర్షపు నీరు పట్టేందుకు పెట్టిన డబ్బా, బకెట్‌

ఖమ్మంవైద్యవిభాగం: చాలా ఏళ్లుగా కురుస్తున్న ఖమ్మం ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలోని పాత భవనం పైకప్పు ఆధునికీకరణ పనుల కోసం గత ఏడాది అప్పటి జిల్లా కలెక్టర్‌ వీ.పీ.గౌతమ్‌ రూ.26.48 లక్షల నిధులు కేటాయించారు. కాంట్రాక్ట్‌ తీసుకున్న టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ సంస్థ పనులు నాసిరకంగా చేయడంతో భవనంలో పలుచోట్ల యథావిధిగా కురుస్తోంది. అధికారులు పట్టించుకోవాలని సిబ్బంది, రోగులు కోరుతున్నారు.

కార్యకర్తలపై దాడి చేస్తే ఊరుకోం..



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్‌

ఖమ్మంమయూరిసెంటర్‌: గతంలో అధికార అండ చూసుకొని తమ కార్పొరేటర్లపై దాడులు చేశారని, ఇప్పుడు తమ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, దీనిని చూస్తు ఊరుకోమని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్‌ కార్యకర్త సాయికిరణ్‌ను పరామర్శించి మేయర్‌ పునుకొల్లు నీరజతో కలిసి 48వ డివిజన్‌లోని కార్యకర్త నివాసంలో ఆయన మాట్లాడుతూ... వరదలు వచ్చి ప్రాణనష్టం జరుగుతుందని, ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలని పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు తమ కార్యకర్తలు పని చేస్తున్నారన్నారు. ప్రజలకు సహాయం చేస్తున్న సాయి కిరణ్‌పై బీఆర్‌ఎస్‌ నాయకులు, మాజీ కార్పొరేటర్‌ దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ సమావేశంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ హనుమంతరావు, డిప్యూటీ మేయర్‌ ఫాతిమ జోహర, కార్పొరేటర్లు రాపర్తి శరత్, మలీదు వెంకటేశ్వర్లు, సైదులు, కాంగ్రెస్‌ నాయకులు దొబ్బల సౌజన్య, నాగండ్ల దీపక్‌చౌదరి, బాల గంగాధర్‌ తిలక్, మిక్కిలినేని నరేందర్‌ పాల్గొన్నారు.

కేసులపై కాదు.. అభివృద్ధిపై దృష్టి పెట్టండి

ఖమ్మంవైరారోడ్‌: బీఆర్‌ఎస్‌ కార్యకర్తలపై అక్రమకేసులు పెట్టడం కాదు, ఖమ్మం కార్పొరేషన్‌ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని బీఆర్‌ఎస్‌ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు ఆర్జేసీ కృష్ణ, మక్బూల్‌ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... 48వ డివిజన్‌లోకి చేరిన వర్షపు నీటిని కార్పొరేటర్‌ తొలగిస్తుంటే కాంగ్రెస్‌ నాయకులు వాళ్లు చేపించినట్లు ఫొటోలు దిగుతున్నారని విమర్శించారు. అంతేకాకుండా కార్పొరేటర్‌పై అబద్ధపు ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. గతేడాది వచ్చిన వరదల్లో బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి సహాయ సహకారాలు అందించారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో నాయకులు, కార్పొరేటర్లు తోట రామారావు, పసుమర్తి రామ్మోహన్, మాటేటి నాగేశ్వరరావు, తోట వీరభద్రం, రుద్రగాని ఉపేందర్, పొన్నం వెంకటేశ్వర్లు, ఎర్ర అప్పారావు, పాలడుగు పాపారావు, వంగల వెంకట్, చేతి కృష్ణ, మాటేటి కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పగడాల నాగరాజు

'సుడా' పార్క్‌ పరిశీలన

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని సుడా పార్క్‌ను డిప్యూటీ సీఈవో నాగపద్మజ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో నెలకొన్న సమస్యలు, ముఖ్యంగా టాయిలెట్‌ ఉన్నా వాటి వినియోగంలో నెలకొన్న సౌకర్యం లేమి వంటి అంశాలను సమీక్షించారు. పార్కు పర్యవేక్షణ సరిగా లేకపోవడంపై కార్యదర్శి అనురాధను ప్రశ్నించగా సుడాకు లేఖ రాసి పంపామని, విద్యుత్‌ బకాయి చెల్లించాలని సుడా దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

వరల్డ్‌ బుక్‌ ఆఫ్‌ స్టార్‌ రికార్డ్స్‌కు ఎంపిక



హరికిశోర్‌

ఖమ్మంమయూరిసెంటర్‌ (ఖమ్మంమామిళ్లగూడెం): ఖమ్మం జిల్లాకు చెందిన డాక్టర్‌ గండు హరికిషోర్‌కు వరల్డ్‌ బుక్‌ ఆఫ్‌ స్టార్‌ రికార్డ్స్‌లో చోటు దక్కింది. డాక్టర్‌ గండు హరికిశోర్‌ తన సేవల విస్తరణలో భాగంగా ఆయా విభాగాల్లో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు పొందారు. ఆయా రంగాల్లో అందజేస్తున్న సేవలకు పురస్కారం దక్కిందని, డిసెంబర్‌ 29న నేపాల్‌ దేశంలోని ఖాట్మండులో అధికారికంగా సత్కారం ఉంటుందని హరికిషోర్‌ తెలిపారు.

పదోన్నతుల షెడ్యూల్‌ విడుదల చేయాలి

ఖమ్మం సహకారనగర్‌: ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేసిన ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల పదోన్నతులను కూడా పూర్తి చేయాలని టీఎస్‌యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్‌.రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. నేటి వరకు పదోన్నతుల షెడ్యూల్‌ విడుదల చేయకపోవడం సరికాదని, పదోన్నతుల షెడ్యూల్‌ విడుదల చేయకపోతే గిరిజన సంక్షేమశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు.

చలో హైదరాబాద్‌కు తరలిరండి

ఖమ్మం సహకారనగర్‌: కాంట్రిబ్యూటరీ పింఛన్‌ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ సెప్టెంబర్‌ 1న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఛలో హైదరాబాద్‌కు ఉద్యోగులు తరలిరావాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి టీజీఏసీ చైర్మన్‌ లచ్చిరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని ఓ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చోటు చేసుకున్న ఘటనపై జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. ఆ కేంద్రంలో ఓ యువకుడిని ఉంచి తాళం వేయడంపై వివాదం చోటు చేసుకుంది. దీంతో విచారణ చేపట్టిన అధికారులు.. సెలవు రోజున కేంద్రం తెరిచిన ఆయాకు మెమో జారీ చేశారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరిగితే విధుల నుండి తొలగిస్తామని హెచ్చరించినట్లు తెలిసింది. ఈ విచారణలో సీడీపీఓ వీరభద్రమ్మ, సూపర్‌వైజర్లు కోటేశ్వరమ్మ, వెంకటమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై సర్వే..

ఖమ్మంఅర్బన్‌: నగరంలోని 6వ డివిజన్‌ ప్రశాంతినగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే నిర్వహించారు. రోడ్లు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు సమస్యలను వివరించారు. పార్టీ ఖానాపురం హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు, నాయకులు రమ్య, కత్తుల అమరావతి, వెంకటాద్రి, పవన్, ఆనందరావు, నరసింహ, అంజయ్య, మురారి, కిరణ్, శ్రీనివాస్‌ ఉన్నారు.

తిరుమలాయపాలెం: పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు ఎర్రా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామంలో పేదల ఇళ్లను సీపీఎం ప్రతినిధి బృందం సభ్యులతో కలిసి పరిశీలించారు. పార్టీ మండల కార్యదర్శి శ్రీను, నాయకులు నేరుసుల వెంకటేష్, పులకాని వెంకట నరసయ్య, గురవయ్య, ఎడ్ల లక్ష్మి, రమేష్, మంగతాయి, శ్రీదేవి ఉమేష్, బాలమ్మ, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు



ఫిర్యాదు చేస్తున్న నవీన్, తదితరులు

నేలకొండపల్లి: ముసాయిదా ఓటర్ల జాబితాపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీడీఓ యం.యర్రయ్యను నేలకొండపల్లి మేజర్‌ పంచాయతీ మాజీ సర్పంచ్‌లు రాయపూడి నవీన్, వెంకన్న, మాజీ ఎంపీటీసీ బొందయ్య శుక్రవారం కలిశారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒక వార్డులో ఉంచాలని, ఒక వార్డుకు చెందిన ఓటర్లు ఒకే ప్రదేశంలో ఉంచాలని, పోలింగ్‌ కేంద్రాలను అందుబాటులో ఉంచాలని కోరారు. వీటిని జిల్లా అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు. బచ్చలకూరి నాగరాజు, గుడిబోయిన వెంకటేశ్వర్లు, కడియాల నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ



పుస్తకాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాలకు ఇంటర్నేషనల్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ హ్యూమన్‌ వాల్యూస్‌ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేల విలువైన బీరువాతోపాటు రూ.40 వేల విలువైన గ్రంథాలయ పుస్తకాలను వితరణగా అందజేశారు. హెచ్‌ఎం విజయ కుమారి, సంస్థ ప్రతినిధులు చైతన్య కిషోర్, వెంకటేశ్వరరావు, మహేష్‌ ఉపాధ్యాయులు పెసర ప్రభాకర్‌రెడ్డి, నరేందర్, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, శోభన, కృష్ణ కళ, గోపమ్మ, శేషవని, శ్రీదేవి, శ్యామ్‌ కుమార్, హమీద్, హనుమంతు, శ్రీనివాసరావు, ప్రసాద్, రఘు బాబు, అరుణ ఉన్నారు.

సమాధుల స్థలాన్ని రక్షించాలి

ఖమ్మంగాంధీచౌక్‌: సీఎస్‌ఐ సంఘాలు ఖమ్మం నగరంలో కొత్తగూడెం–అల్లీపురంల మధ్య కొనుగోలు చేసిన 5 ఎకరాల క్రైస్తవుల సమాధుల స్థలాన్ని భూకబ్జాదారుల నుంచి రక్షించాలని సంఘాల ప్రతినిధి సీఎస్‌ఐ సెయింట్‌ మేరీస్‌ చర్చ్‌ పాస్టేట్‌ చైర్మన్‌ డాక్టర్‌ వి.విశ్వం కోరారు. శుక్రవారం సీఎస్‌ఐకు చెందిన 7 సంఘాల ప్రతినిధుల సమావేశం నగరంలోని పార్శీబంధం చర్చిలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వం మాట్లాడుతూ.. సంఘాల ప్రతినిధి వాడపల్లి ప్రసాదరావు 2018లో ఆ భూమిని కొనుగోలు చేశారని, ప్రహరీ ఏర్పాటు చేయకపోవటంతో కబ్జాదారులు తప్పుడు పత్రాలను సృష్టించి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారన్నారు. ఈ మేరకు రేపు (ఆదివారం) సాయంత్రం 3 గంటలకు మహార్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. సీఎస్‌ఐ గ్రూప్‌ సంఘాల ఖమ్మం అధ్యక్షులు అర్వపల్లి రమేష్, శ్రీనివాస్, జార్జ్, ఏసుబాబు, చిట్టిబాబు, జయరాజ్, శేఖర్‌ బాబు, దొడ్డ అశోక్, జోసఫ్‌ రామారావు, విజయ్‌పాల్, మార్టిన్, పి.దాసు, జయరాజు, పాల్‌ తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేరు చేయడంతోనే పర్యావరణ పరిరక్షణ

ఖమ్మంమయూరిసెంటర్‌: ప్రతీ ఇంటి నుంచి వెలువడే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయడంతో శుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని మేయర్‌ పునుకొల్లు నీరజ అన్నారు. శుక్రవారం 26వ డివిజన్‌ సుగ్గుల వారి తోట పరిధిలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇటీవల ఇండోర్‌లో స్టడీ టూర్‌ అధ్యయనం చేసి మొదటిసారిగా నగరంలోని 26వ డివిజన్‌ ప్రజలకు అవగాహన కల్పించనున్నామన్నారు. ప్రతీ కుటుంబం ఈ విధానాన్ని ఆచరించాలన్నారు. అనంతరం డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికులకు మేయర్‌ మొక్కలను పంపిణీ చేశారు. ప్రతీ కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దాన్ని సంరక్షిస్తే నగరం పచ్చదనంతో నిండిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ ఫాతిమా జోహర, టీఎంసీ సుజాత, ఎస్సై మల్లయ్య, ఎన్‌రోల్‌మెంట్‌ ఏఈ శ్రీనివాస్, సీఓ ద్రౌపతి, వార్డ్‌ ఆఫీసర్‌ రాజు, జవాన్‌ రాజు, ఆర్పీలు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యం.. పొలాల్లోకి వరద



చెరువును తలపిస్తున్న వరిపొలాలు

నేలకొండపల్లి: కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. పంట కాల్వను పూడ్చి రహదారి వేయటంతో పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని బైరవునిపల్లి–తిరుమలాపురం గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణం 3 కి.మీ ఏర్పాటు చేశారు. నిర్మాణ సమయంలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న పంట కాల్వను తొలగించారు. రైతులు నిలదీయగా పనులు పూర్తయిన తరువాత కాల్వ తీసి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోడ్డు నిర్మాణం పూర్తయినా కాల్వ తీయకపోవడంతో వరి పొలాల్లోకి వరద నీరు చేరటంతో పంట కొట్టుకపోయింది. చెరువును తలపించే విధంగా వరి పొలాలు మిగిలాయి. దాదాపు 30 ఎకరాలు పొలాలు నీటిలోనే ఉన్నాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని, వెంటనే పంట కాల్వ తీయకుంటే ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

గణేష్‌ మండపాల్లో ప్రత్యేక పూజలు



ఖమ్మంగాంధీచౌక్‌: కుంకుమ పూజలు..



ఖమ్మంఅర్బన్‌: పూజా సామగ్రి, ప్లేట్లు పంపిణీ చేస్తున్న ట్రాఫిక్‌ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంఅర్బన్‌: నగరంలోని పలు వినాయక మండపాల్లో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఇందిరానగర్‌లోని మండపంలో పూజా సామగ్రితో పాటు, ప్లేట్లను ఉత్సవ కమిటీ అందించిన వాటిని ఖమ్మం ట్రాఫిక్‌ ఏసీపీ బాణాల శ్రీనివాసులు భక్తులకు పంపిణీ చేశారు. దేవస్థానం ఈవో వీవీ నరసింహారావు, చైర్మన్‌ బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు, ప్రధానార్చకులు ఆళగిరి గిరిధర్, భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు. 14వ డివిజన్‌లో సహస్ర అపార్ట్‌మెంట్‌లో కుంకమపూజలు నిర్వహించారు. యాదవసంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మా రోశయ్య, కమతం రామకృష్ణ, నరసింహారావు ఉన్నారు.

ఖమ్మంగాంధీచౌక్‌: గణపతి ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద మహిళలతో ప్రత్యేకంగా కుంకుమ పూజలు చేయించారు. నగరంలోని బైపాస్‌ రోడ్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో ఏర్పాటుచేసిన గణేష్‌ విగ్రహం వద్ద చైర్మన్‌ ఫణిభట్ల రాజలింగయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు.